దేవుడు కలలో చెప్పాడని.. ఆత్మహత్యాయత్నం

- ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పుటించుకున్న మహిళ
- రాజేంద్రనగర్ పరిధిలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేవుడు కలలోకి వచ్చి చెప్పాడంటూ ఓ మహిళ ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పు అంటించుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. రాజేంద్రనగర్ సీఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నంది ముసలైగూడకు చెందిన శివాని(35) భర్త లేకపోవడంతో తల్లితో కలిసి ఉంటుంది. స్థానికంగా భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తోంది. కొద్ది కాలంగా ఆమె మానసిక పరిస్థితి సరిగా లేదు. మంగళవారం ఉదయం అత్తాపూర్‌లోని ప్రధాన రహదారి పక్కన కూర్చుని ఒక్కసారిగా ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పంటించుకుంది. వెంటనే స్థానికులు గమనించి మంటలను ఆర్పారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. అయితే రాత్రి దుర్గాదేవి కలలో కనిపించి ఆత్మహత్య చేసుకోవాలని చెప్పిందని, అందుకే తాను ఆత్మహత్య చేసుకున్నానని శివాని తెలిపింది. తనకు భర్త లేడని, తాను ఎవరి కోసం జీవించాలని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నానని పోలీసులకు తెలిపింది. పోలీసులు ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ తెలిపారు.

పరిహారం కోసం ఇరిగేషన్ ఎఇ నిర్బంధం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రాజెక్టులో మునిగిన భూములకు సంబంధించి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు ఇరిగేషన్ శాఖ ఏఈని నిర్బంధించారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఆనంద గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇరిగేషన్‌శాఖ ఎఇని మంగళవారం నిర్బంధించారు. అన్నారం ప్రాజెక్టులో భాగంగా భూములు తీసుకున్న ప్రభుత్వం సుమారు 365 ఎకరాలకు క్రాప్‌హాలిడే పరిహారాన్ని ప్రకటించింది. సుమారు ఎనిమిది సీజన్లకు చెందిన క్రాప్ హాలిడే కింద రావాల్సిన పరిహారంలో మూడు పంటలకు మాత్రమే ప్రభుత్వం డబ్బులు చెల్లించింది. మిగతా పరిహారం కోసం గ్రామస్తులు ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో సర్వే కోసం వచ్చిన ఇరిగేషన్ శాఖ ఏఈ వెంకన్నను గ్రామస్తులు పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటేశ్వర్ ఉన్నతాధికారులతో మాట్లాడి పరిహారం అందేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఎఇని వదిలేశారు.

అంతా అదానీ కోసమే..

- బయ్యారాన్ని ఎండబెడుతున్నరు.. విశాఖ పొట్టగొడుతున్నరు...
- కేంద్రం చర్యలతో తెలుగు రాష్ట్రాలకు తీవ్రనష్టం
- రాష్ట్ర మంత్రి కెటిఆర్ ఆవేదన
- తాను చెప్పింది తప్పయితే పరువు నష్టం దావా వేసుకోవాలంటూ బిజెపికి సవాల్

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధాని మోడీ తన మిత్రుడైన అదానీకి దేశ సంపదను అప్పనంగా దోచి పెడుతున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కె తారక రామారావు విమర్శించారు. అదానీ కోసమే తెలంగాణలోని బయ్యారాన్ని ఎండబెడుతున్నారు.. విశాఖ స్టీల్ ప్లాంట్ పొట్టగొడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం చర్యలు... తెలుగు రాష్ట్రాలకు తీవ్రనష్టదాయకమని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం మంత్రులు సత్యవతి రాథోడ్, పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు తదితరులతో కలిసి కెటిఆర్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. బయ్యారంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు, విశాఖ స్టీల్ ప్లాంటుకు గనుల కేటాయింపు తదితర విషయాల్లో మోడీ సర్కారు అనుసరిస్తున్న విధానాలను ఆయన ఈ సందర్భంగా తప్పుబట్టారు. రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీని నిర్మించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుంచి కోరుతున్నా... కేంద్రం పట్టించుకోవటం లేదని తెలిపారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి కేసీఆర్ అనేకసార్లు కేంద్రానికి లేఖలు రాశారని, ఆనాటి గనుల శాఖ మంత్రిగా తాను ప్రధానికి వినతిపత్రం సమర్పించానని ఆయన గుర్తు చేశారు. బయ్యారంలో దొరికే ముడి ఖనిజం నాణ్యత రీత్యా అక్కడ కర్మాగారం స్థాపించటం సాధ్యం కాదంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పటం శోచనీయమన్నారు. అలాంటప్పుడు పక్కనే ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని బైలడిల గనుల నుంచి ముడి ఇనుమును సరఫరా చేయటం ద్వారా ఇటు బయ్యారంలో ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేయొచ్చు.. అటు విశాఖ స్టీల్ ప్లాంటును కాపాడుకోవచ్చని తెలిపారు. కానీ ఈ పని చేస్తే బైలడిలలో సమీకృత ముడి ఇనుప ఖనిజ పరిశ్రమ(ఇంటిగ్రేటెడ్ ఐరన్ ఓర్ కంపెనీ)ను నెలకొల్పిన అదానీకి నష్టమని... అందువల్లే ప్రధాని మోడీ దాని గురించి మాట్లాడటం లేదని విమర్శించారు. అక్కడి ఇనుప ఖనిజం గనులను అదానీకి కట్టబెట్టటమే దీనికి కారణమని చెప్పారు. బైలడిల నుంచి 180 కిలోమీటర్ల దూరంలో ఉన్న బయ్యారానికి, 600 కిలోమీటర్ల దూరంలో విశాఖకు ఖనిజం సరఫరా చేయటం సాధ్యం కాదని చెప్పిన కేంద్రం...అక్కడి నుంచి 1,800 కిలోమీటర్ల దూరంలో గుజరాత్‌లో ఉన్న ముంద్రాకు మాత్రం ఐరన్ ఓర్‌ను సరఫరా చేస్తోందని విమర్శించారు. ఈ రకంగా లాభాలను తన దోస్తులకు దోచి పెడుతున్న మోడీ.. నష్టాలను మాత్రం జాతికి అంకితం చేస్తున్నారని కెటిఆర్ ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. ఇందుకు సంబంధించి తన వద్ద పూర్తి ఆధారాలున్నాయని ఆయన తెలిపారు. ఒకవేళ తాను చెప్పింది తప్పయితే తనపై పరువు నష్టం దావా వేసుకోవచ్చంటూ బిజెపి నేతలకు ఆయన సవాల్ విసిరారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి మాట్లాడుతున్న తమపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తున్న ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు అసలు విషయ పరిజ్ఞానం లేదని కెటిఆర్ ఎద్దేవా చేశారు. ఈ రకంగా ప్రస్తుతం దేశాన్ని అదానీ, అజ్ఞానులు (బిజెపి నేతలు) కలిసి నాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవటంలో భాగంగా అక్కడి బిడ్డింగ్ ప్రక్రియలో తమ ప్రభుత్వం పాల్గొంటుందని తెలిపారు. ఈ క్రమంలో సాధ్యాసాధ్యాలను, వాస్తవాలను పరిశీలించేందుకు రాష్ట్ర అధికారులు విశాఖకు వెళ్లారని వివరించారు. వారిచ్చే నివేదిక ఆధారంగా తగు నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవటమనేది తమ ప్రభుత్వ విధానమని తెలిపారు. వైజాగ్ స్టీల్ ఫ్యాక్టరీకి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైఖరి గురించి ప్రశ్నించగా... 'దానిపై ఎలాంటి ఆసక్తి లేదు.. ఇక్కడ ఎపి ప్రభుత్వం కాదు, కేంద్రం ఏం చేస్తున్నదనేదే ముఖ్యం...' అని కెటిఆర్ వ్యాఖ్యానించారు. నిజాం చక్కెర కర్మాగారాన్ని పునరుద్ధరించేందుకు, సిర్పూర్ పేపర్ మిల్లును తెరిపించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన వివరించారు.

16న మోడల్ స్కూళ్లలో ప్రవేశాల రాతపరీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో ఆరో తరగతితోపాటు ఏడు నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు సంబంధించి ఖాళీ సీట్ల భర్తీ కోసం ఈనెల 16వ తేదీన రాతపరీక్ష జరగనుంది. ఈ మేరకు మోడల్ స్కూళ్ల అదనపు సంచాలకులు సిహెచ్ రమణకుమార్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆరో తరగతి, అదేరోజు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఏడు నుంచి పదో తరగతి వరకు దరఖాస్తు చేసిన విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ నెల ఆరో తేదీ నుంచి www.tsmodelschools.com వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం కల్పించామని వివరించారు. 70,041 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారని తెలిపారు.

మహారాజశ్రీ 5వ అడిషినల్ జిల్లా జడ్జి వారి కోర్టు :: రాజమహేంద్రవరం
I.A.No. 415/2021
O.S.No. 205/2016

బిట్వీన్:
M/s. శ్రీ S.V.R.K. పౌల్ట్రీస్, రిజిష్టర్డ్ పార్ట్‌నర్‌షిప్ ఫర్మ్, Rep. by Its మేనేజింగ్ పార్ట్‌నర్ ఎ.వెంకటేశ్వరరావు (డైడ్), Rep. by Its పార్ట్‌నర్ అనపర్తి సత్యపాయి కుమారి
...పిటీషనర్లు /వాదులు
మరియు
ఆర్-6) మద్దసాని రమేష్ యాదవ్, తండ్రి: వీరయ్య, హిందూ, వయస్సు 41 సం॥లు, R/o. డో.నెం. 99W -ఉదయ సాయి నగర్, వనస్థలిపురం, హైదరాబాద్, వగైరాలు.
...రెస్పాండెంట్లు /ప్రతివాదులు
ప్రకటన

పై నెంబరు దావా గ్రంధములో శ్రీ కోర్టు వారి డిస్మిస్ ఉత్తర్వులు రద్దు చేయమని కోరుతు దాఖలు చేసిన పిటీషను ఐ.ఎ.నెం. 415/2021లో పై 6వ రెస్పాండెంటు మద్దసాని రమేష్ యాదవ్ గారి హాజరు నిమిత్తం ది. 28-04-2023వ తేదీకు వాయిదా అయివున్నది. కావున పై ఐ.ఎ.నెం. 415/2021 పిటీషనులో 6వ రెస్పాండెంటు అయిన మద్దసాని రమేష్ యాదవ్ గార్కి ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల పై తేదీ **ది.28-04-2023వ తేదీ ఉదయం గం॥ 10:30 ని॥ల లగాయితూ స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై తెలియజేసుకొనవలెనని** లేని ఎడల వారి పరోక్షమందు పై పిటీషను ఐ.ఎ.నెం. 415/2021ను శ్రీ కోర్టు వారు తీర్మానించు దురని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
సి. హెచ్.వెంకటేశ్వరరావు,
సి. హెచ్.దత్త కృష్ణ నిఖిత్,
రాజమండ్రి, 25-3-23. పిటీషనరు తరుపు అడ్వకేట్స్, రాజమండ్రి.

'పది' హిందీ పేపర్ లీకేజీ కేసులో..

బండి సంజయ్ కస్టడీ పిటీషన్ కొట్టివేత

- మరో ముగ్గురికి బెయిల్ మంజూరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి పరీక్షా పత్రాల లీకేజీ కేసులో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కస్టడీ కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటీషన్‌ను కోర్టు డిస్మిస్ చేసింది. ఈ నెల 11వ తేదీన ఈ పిటీషన్‌పై కోర్టులో విచారణ జరిగిన విషయం విదితమే. కస్టడీ అవసరం లేదని, ఇప్పటికే పోలీసుల విచారణ పూర్తయిందని బండి సంజయ్ న్యాయవాదులు చేసిన వాదనతో కోర్టు ఏకీభవించింది. దాంతో పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌ను న్యాయమూర్తి డిస్మిస్ చేశారు. కేసులో కుట్ర కోణం లేదని, కస్టడీలోకి తీసుకొని విచారించాల్సిన అవసరం లేదని సంజయ్ న్యాయవాదులు తమ వాదనలను వినిపించారు.

ఈ కేసులో సంజయ్‌తోపాటు జైలుకు వెళ్లిన మరో ముగ్గురికి హన్మకొండ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఏ2 ప్రశాంత్, ఏ3 మహేశ్, ఏ5 శివగణేష్‌కు పలు కండిషన్‌లతోకోర్టు బెయిల్ మంజూరు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో ముగ్గురు నిందితులు కరీంనగర్ జైలు నుండి విడుదల కానున్నారు.

మరో రైతాంగ పోరాటానికి సిద్ధమవుతాం

- ఎఐకెఎస్ జెండావిష్కరణలో టి సాగర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మరో రైతాంగ పోరాటానికి సిద్ధం కావాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ పిలుపునిచ్చారు. మంగళరం హైదరాబాద్‌లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి జెండాను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి జంగారెడ్డి, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, నాయకులు ఆంజనేయులు, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు యం. ధర్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్న పేదలు

ఇంటి స్థలం100 గజాలు ఇవ్వలేరా ?

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లెల బాలకృష్ణ
- కోరుట్లలోని ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్న పేదలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు వేల ఎకరాలు కట్టబెడుతున్న ప్రభుత్వం.. పేదలకు ఇంటి స్థలం కోసం 100 గజాలు ఇవ్వలేదా అని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లెల బాలకృష్ణ ప్రశ్నించారు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమిలో మంగళవారం గుడిసెలు వేశారు. అక్కడే జ్యోతిరావు పూలే 197 జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనీసం ఒక్కో పేదింటికి 100 గజాల స్థలమైనా కేటాయించకుండా.. ప్రభుత్వం ఇళ్లు కట్టుకునేందుకు డబ్బులు ఇస్తామంటోందన్నారు. స్థలం లేకుండా ఇళ్లు ఎలా కట్టుకుంటారని ప్రశ్నించారు. కూలీనాలి చేసుకున్న రెక్కాడితేగానీ డొక్కాడని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని పేదలకు స్థలం కేటాయించి ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 28 కేంద్రాల్లో తమ పార్టీ ఆధ్వర్యంలో లక్షా 70 వేల గుడిసెలు వేయించామని, ఇందులో 90 వేల మందికి పక్కా గృహాలు ఏర్పడ్డాయని చెప్పారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లు లేని పేదలకు స్థలాలు ఇప్పించేవరకు తమ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు సాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జగిత్యాల జిల్లా కన్వీనర్ తిరుపతి నాయక్, నాయకులు ఇందూరి సులోచన, ఎంఎ చౌదరి, ముదుగం రాజలింగు, గుమ్మడి రమేష్, జంగిలి ఎల్లన్న, గంగారెడ్డి, తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం నాయకులు లాక్‌వత్ మహిపాల్, భూపోరాట నాయకులు, పేదలు పాల్గొన్నారు.

ప్రపంచంతో పోటీ పడేలా విద్యావకాశాలు : మంత్రి సబిత

ఒయు ఇంజినీరింగ్ వసతిగృహ సముదాయానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ బిడ్డలు ప్రపంచంతో పోటీ పడేలా రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యావకాశాలు కల్పిస్తోందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సిఎం కెసిఆర్ విద్యారంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించారని చెప్పారు. ఒయులో ఇంజినీరింగ్ వసతిగృహ సముదాయానికి హోంశాఖ మంత్రి మహమూద్ అలీతో కలిసి మంగళవారం సబితాఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రూ.39.50 కోట్లతో 500 మంది విద్యార్థులకు సరిపోయేలా హాస్టల్ భవన నిర్మాణం చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. మహమూద్ అలీ మాట్లాడుతూ.. ఆరు నెలల వ్యవధిలోనే రూ.113 కోట్లతో ఒయులో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. విద్యారంగంలో మౌలిక వసతుల కల్పన కోసం విద్యాశాఖమంత్రి కష్టపడి పని చేస్తున్నారని ప్రశంసించారు. ఒయు విసి ప్రొ రవీందర్ మాట్లాడుతూ.. ఒయులో ఎప్పుడూ లేని విధంగా పెద్దఎత్తున మౌలిక వసతుల కల్పన జరుగుతోందన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో సముచిత నిధులు సమకూరుస్తోందన్నారు. మరో రెండు వసతి గృహాల నిర్మాణం కోసం గిరిజన సంక్షేమ శాఖ నుంచి రూ.40 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని వివరించారు.

గవర్నరా, బిజెపి నాయకురాలా?

- బిల్లులను పెండింగ్‌లో ఉంచే అధికారం ఆమెకెక్కడిది..
- గవర్నర్‌ను అడ్డుపెట్టి కేంద్రం ఆడుతున్న నాటకం
- మంత్రి జగదీశ్‌రెడ్డి

మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గవర్నర్ గవర్నరుగా కాకుండా బిజెపి నాయకురాలిలా పనిచేస్తున్నారని విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామిక పద్ధతిలో ఎన్నికైన ప్రభుత్వం రూపొందించే చట్టాలను అడ్డుకునే అధికారం గవర్నర్‌కెక్కడిదని ప్రశ్నించారు. రాజ్యాంగ మూలసూత్రాలను కాదని చట్టాలు రూపొందిస్తే అడ్డుకునే అధికారం సుప్రీంకోర్టు ధర్మాసనానికి మాత్రమే ఉందని చెప్పారు. ప్రజాస్వామిక ప్రభుత్వాలు నిండు సభలో శాసనసభ్యుల ఆమోదంతో రూపొందించిన బిల్లులను నిలువరించే హక్కు గవర్నర్ లేదన్నారు. యావత్ ప్రపంచానికి భారత పార్లమెంటరీ వ్యవస్థ, రాజ్యాంగం స్ఫూర్తిదాయకంగా నిలిస్తే.. మోడీ సర్కార్ దాన్ని తూట్లు పొడుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత ప్రజాస్వామ్యానికి ఇది గొడ్డలి పెట్టని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపియేతర రాష్ట్రాల అభివృద్ధిని అడ్డుకునే కుట్రలో ఇది భాగమని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులను గవర్నర్ పెండింగ్‌లో పెట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్ర శాసనసభలో ఒకలా.. రాజ్ భవన్‌లో మరోలా ప్రవర్తించడం గవర్నర్ తమిళిసైకే చెల్లిందన్నారు. నిన్నగాక మొన్న నిండు సభలో తెలంగాణా అభివృద్ధిని స్వయంగా కొనియాడిన గవర్నర్.. రాజ్‌భవన్‌కు వెళ్లగానే అదే సభలో ఆమోదించిన పద్దులను పెండింగ్‌లో పెట్టడమే ఇందుకు తార్కాణమన్నారు. బిజెపియేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్లను కేంద్రం బిజెపి కార్యకర్తల్లాగా వినియోగించుకుంటోందని విమర్శించారు. తమిళనాడు శాసనసభ సమావేశాల్లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం గవర్నర్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేసిందంటే కేంద్రం వైఖరి ఏమిటో బట్టబయలైందన్నారు. గవర్నర్‌ను అడ్డు పెట్టుకుని కేంద్రం ఆడుతున్న దుర్మార్గమైన నాటకానికి గవర్నర్ల తీరు నిదర్శనంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తుంటే తట్టుకోలేక బిజెపి ఈ డ్రామాలను తెర లేపిందని విమర్శించారు. ఇక్కడి పథకాల డిమాండ్ బిజెపి పాలిత రాష్ట్రాల్లో ప్రజల నుంచి వస్తున్నందునే ఇటువంటి కుట్రలకు బిజెపి రూట్ మ్యాప్‌గీసిందన్నారు. బిజెపిపాలిత రాష్ట్రాల కంటే బిజెపియేతర రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధి మోడీ సర్కార్‌కు కంటగింపుగా మరినందునే రాజ్‌భవన్‌లను అడ్డుపెట్టుకుని గవర్నర్‌లు బిల్లులను పెండింగ్‌లో పెడుతున్నారని, ఇది ప్రజాస్వామ్యానికి హానికరమని అన్నారు.

సన్మార్గంలో నడిపేది పుస్తకం

- డిజిటల్ యుగంలో సాహిత్యానికి ఆదరణ
- వచ్చే ఏడాది కళాభారతిలో పుస్తకాల ప్రదర్శన
- మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమాజంలో ప్రతి మనిషినీ సన్మార్గంలో నడిపేది ఒక పుస్తకం మాత్రమేనని ఎక్సైజ్ క్రీడలు సాంస్కృతిక సమాచార శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ మైదానంలో మంగళవారం ఏర్పాటు చేసిన నవతెలంగాణ పుస్తక ప్రదర్శనను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు ప్రతి మనిషీ వేగంగా ప్రయాణిస్తూ.. ఆలోచింపజేస్తున్న డిజిటల్ యుగంలోనూ సాహితీ రంగానికి ఎంతో ఆదరణ ఉందన్నారు. ఎందరో మహనీయుల జీవిత చరిత్రలు, జ్యోతిరావు పూలే లాంటి సాహితీవేత్తలను గుర్తుకు తెచ్చేవి ఒక్క పుస్తకాలు మాత్రమేనని చెప్పారు. ఎంతటి చెడ్డవారిలోనైనా పుస్తక జ్ఞానం ద్వారా మార్పు తీసుకురావచ్చని తెలిపారు.

పుస్తకాలకు సాహిత్యానికి ఆదరణ లేదంటూ చర్చ జరుగుతున్న ఈ రోజుల్లో నవ తెలంగాణ యాజమాన్యం పుస్తక సాహిత్యాన్ని ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చి ప్రదర్శిస్తున్నందుకు వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. దేశంలో మన మహనీయులు సాధించిన అనేక విజయాలను, చరిత్రను ఘట్టాలను నేటి కేంద్ర ప్రభుత్వం మరుగున పరిచేందుకు కుట్ర చేస్తోందని విమర్శించారు.

తెలంగాణ పోరాటంలో తాను ప్రత్యక్షంగా పాల్గొన్న అనేక సంఘటనలను వివిధ పత్రికల్లో ప్రచురించిన అంశాలతో ముద్రించిన పుస్తకాలను నవతెలంగాణ వారికి అందజేశారు. ప్రస్తుతం ఇక్కడ ఈ చిన్న స్థలంలో పుస్తక ప్రదర్శన నిర్వహించుకుంటున్నారని, వచ్చే ఏడాది నాటికి కళాభారతిని పూర్తి చేసి అందులో పెద్దఎత్తున పుస్తక ప్రదర్శన నిర్వహించడానికి అవకాశం ఇస్తామని తెలిపారు. ఇలాంటి మంచి కార్యక్రమం చేస్తున్న పత్రిక యాజమాన్యానికి ప్రభుత్వం తరఫున ఎప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ జనరల్ మేనేజర్ వాసు, ఉమ్మడి జిల్లా మేనేజర్ ఎం.కార్తీక్, ప్రాంతీయ ప్రతినిధి పరిపూర్ణం, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ రాములు, సీనియర్ నాయకులు కె గోపాల్, నల్లవెల్లి కురుమూర్తి, చంద్రకాంత్, రాజు కుమార్, నవతెలంగాణ డెస్క్ ఇన్‌చార్జి భాస్కర్, విలేకరి జనార్ధన్, బుక్‌హౌస్ ఇన్‌చార్జి సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

'న్యాక్'కు విశ్వకర్మ అవార్డు

- మంత్రి వేముల హర్షం
- న్యాక్ డిజి, డైరెక్టర్లకు అభినందన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కన్స్ట్రక్షన్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (న్యూఢిల్లీ) నిర్మాణ నైపుణ్య అభివృద్ధికి అచీవ్‌మెంట్ 14వ అవార్డును 'న్యాక్' గెలుచుకుంది. ఈ అవార్డును జాతీయ నిర్మాణ అకాడమీ డైరెక్టర్లు సోమవారం సాయంత్రం న్యూఢిల్లీలో ఐసిఎఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో స్వీకరించారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ వీటిని ప్రధానం చేశారు. న్యాక్‌కు "నిర్మాణ నైపుణ్య అభివృద్ధి అచీవ్‌మెంట్" విభాగంలో ప్రతిష్టాత్మక విశ్వకర్మ అవార్డు రావడం పట్ల న్యాక్ వైస్ చైర్మెన్ ,రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.న్యాక్ గత ఏడాదిలో 21,240 మంది వ్యక్తులకు నిర్మాణ సంబంధిత శిక్షణా కార్యక్రమాలను నిర్వహించిందని గుర్తు చేశారు. వారిలో చాలా మంది యువతను ప్రయివేటు పరిశ్రమలో విజయవంతంగా ఉపాధి అవకాశాలు కల్పించినందుకు గాను 2023 సంవత్సరానికి భారతదేశంలోనే ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్న ఏకైక నైపుణ్యాన్యాభివద్ధి సంస్థ న్యాక్ అని కొనియాడారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డును న్యాక్ సంస్థ అందుకోవడం గర్వించదగ్గ విషయం అని మంత్రి అన్నారు. స్కిల్ డెవలప్మెంట్ పెంచి యువతకు ఉద్యోగ కల్పనకు కృషి చేసేందుకుగాను జిల్లాలకు న్యాక్ విస్తరిస్తున్నదని మంత్రి వెల్లడించారు. అవార్డు రావడానికి కృషి చేసిన న్యాక్ డైరెక్టర్ జనరల్ కె బిక్షపతి, డైరెక్టర్లు శాంతిశ్రీ, ఎం రాజీరెడ్డి, హేమలత, సత్యపాల్‌రెడ్డి తదితరులను మంత్రి అభినందించారు. అవార్డు నేపథ్యంలో డిజి బిక్షపతి స్పందిస్తూ అత్యుత్తమ శిక్షణ ఇవ్వడం ద్వారానే భవిష్యత్ సమాజానికి పునాదులు వేయగలమని వ్యాఖ్యానించారు. సమిష్టి కృషి ద్వారా ఈ అవార్డును సాధించగలిగామని చెప్పారు. డైరెక్టర్ శాంతిశ్రీ మాట్లాడుతూ న్యాక్‌కు కార్పొరేట్ సంస్థలు సహకరిస్తే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. యువతను శిక్షణను ఇవ్వడంలో న్యాక్ అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తోందని గుర్తు చేశారు.

IN THE COURT OF THE HON'BLE VIII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT :: HYDERABAD.
I.A.No. **1271** of **2022**
in
I.A.No. **1299** of **2019**
in
O.S.No. **2370** of **2018**

Between:
C.M.Praveen Raju
..Petitioner/Plaintiff.
And
Hanuman Das Biyani and another
..Respondents/Defendants.
To
1.Hanuman Das Biyani S/o Papalal Biyani, 53 years, Business, R/o 18-7-181/12/A, CIB Qiuarters, Gowlipura, Hyderabad.
...Respondent No.1./Defendant No.1.
Sir,

Please take notice that the above named petitioner/plaintifff filed the above I.A. Under Order 9 Rule 4.of C.P.C. for restoration of the I.A.No. 1299/2022, and the same is posted to 1-6-2023 for your notice and Counter. You are hereby directed to appear before the said court on **1-6-2023** at **10-30**A.M. either in person or through your counsel. Failing which the matter will be decided in your absence.

//BY ORDER OF THE COURT//
Y. SATYANARAYANA,
Advocate.
OFFICE AT: Flat No.504, JSR Hyland, Road No. 16, Near Netaji Park, Alkapuri Township, Manikonda, Hyderabad-500089.
Cell No.:9441142956.

IN THE COURT OF THE MACT CUM XXIV ADDL.CHIEF JUDGE CITY CIVIL COURT AT :: HYDERABAD
O.P.No. **236** OF **2022**

BETWEEN :
Syed Omer and another.
...Petitioners.
AND
G.Srinivas & others.
...Respondents.
To,
Ganta Srinivas, S/o. Ganta Pochaiah, aged major, occ: Owner of Ashok Leyland Dost Goods Carriage bearing No. AP 28 TD 1968, R/o. 1-73, Ground Floor, Gundla Pochampally, Medchal, TS 500100
...Respondent No.1.

Please take notice that the Petitioners have filed the above O.P. for compensation for the death of Md.Reshma Begum in a road accident caused by Your Ashok Leyland Dost Goods Carriage No.AP-28-TD-1968 on 20.01.2022. The said O.P. is posted to **02.06.2023** at **10.30** AM for your appearance and counter. Kindly make it convenient to be present on the said date before the Hon'ble Court by 10.30 AM in person or through your counsel. Hence this notice.

BY ORDER OF THE COURT
M. VIJAY REDDY
ADVOCATE
2-2-647/A/58, Saibabanagar, Shivam Road, Bagh Amberpet, Hyderabad.
Ph: **7673904549 9330489999**

నేడు ఎల్బీ స్టేడియంలో ఇఫ్తార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం సిఎం కెసిఆర్ పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతియేట ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. మంగళవారం ఎల్బీస్టేడియంలో ఇఫ్తార్ విందు ఏర్పాట్లను మంత్రి మహమూద్ అలీతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకర్లతో మాట్లాడారు. మత సామరస్యం వెల్లివిరిసే విధంగా రంజాన్ వేడుకలు నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహా దారు ఎకె ఖాన్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మెన్ ఇంతియాజ్, హజ్ కమిటీ చైర్మెన్ సలీమ్, వక్ఫ్‌బోర్డు చైర్మెన్ మసీవుల్లా, ఉర్దూ అకాడమీ చైర్మెన్ ముజిబ్, మైనార్టీ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ నదీమ్, డైరెక్టర్ షఫీ ఉల్లాఖాన్ తదితరులు ఉన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి చేసిన పూలే..

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య
- యునియన్ కార్యాలయంలో పూలే జయంతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళల అభ్యున్నతి కోసం జోతిరావు పూలే అహర్నిశలూ కృషి చేశారని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య అన్నారు. హైదరాబాద్ ముషీరాబాద్‌లోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అధ్యక్షతన జ్యోతిరావు పూలే జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం వీరయ్య మాట్లాడుతూ.. పూలే, అతని భార్య సావిత్రిబాయి పూలే దేశంలో మహిళలకు విద్య నేర్పడానికి మార్గదర్శకులుగా నిలిచారన్నారు. పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. 1848లో బాలికల విద్య కోసం పూలే పూణేలో పాఠశాల ప్రారంభించారని, వితంతువుల కోసం ఒక గృహాన్ని స్థాపించారని తెలిపారు. వేదాలను పవిత్రంగా భావించడాన్ని వ్యతిరేకించారని. విగ్రహారాధనను ఖండించారని చెప్పారు. నేటి తరాలకు ఆయన ఆదర్శమని, ఆశయాల సాధన కోసం పునరంకితమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుయ ఎస్‌వి రమ, పి జయలక్ష్మి, కార్యదర్శులు జె వెంకటేష్, బి మధు, పి శ్రీకాంత్, కార్యకర్తలు వై సోమన్న, పి సుధాకర్, ఎ సునీత, ఎస్ఎస్ఆర్ఎ. ప్రసాద్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పూలే స్ఫూర్తితో మనువాదంపై పోరాడుదాం

- ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం ఎంత ప్రమాదమో ప్రజలకు తెలియజెప్పాలి
- జయంతి సభలో సిపిఎం, సిపిఐ నేతలు చెరుపల్లి, చాడ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహాత్మా జోతిబా పూలే స్ఫూర్తితో మనువాదంపై బలమైన ఉద్యమం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, నిర్మించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్-బిజెపి అనుసరిస్తున్న సిద్ధాంతం ఎంత ప్రమాదకరమనే అంశాన్ని ప్రజలకు విడమరిచి చెప్పాలని కోరారు. సమాజాన్ని మార్చేందుకు ఉద్యమాలను ముందుకు తీసుకుపోవడమే పూలేకు ఇచ్చే నిజమైన నివాళి అని వారు అన్నారు. మహాత్మా జోతిబాపూలే 197వ జయంతి సందర్భంగా 'మనువాదాన్ని మట్టుపెడదాం-సామాజిక న్యాయాన్ని కాపాడుకుందాం'అనే అంశంపై మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిపిఐ, సిపిఎం రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చెరుపల్లి మాట్లాడుతూ ఆరోజుల్లో మనువాద భావజాలం ఎంత భయంకరంగా ఉన్నప్పటికీ పూలే... ఆ దుర్మార్గాలు, పీడన, అణచివేత, మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని చెప్పారు. సమాజ మార్పు కోసం కృషి చేశారని వివరించారు. నాడు దేశంలో కులాలు, మతాలు, మూఢ నమ్మకాలు విపరీతంగా ఉన్నాయని, స్త్రీలకు స్వేచ్ఛ లేదని, సమానత్వం లేదని గుర్తు చేశారు. ఈ దురాచారాలకు మూలమైన మనువాదం, వేదాలను పూలే అధ్యయనం చేశారని, బ్రాహ్మణ ఆధిపత్యాన్ని ప్రశ్నించారని అన్నారు. అందరికీ చదువు ఉండాలని, స్త్రీలకు సమాన హక్కులుండాలని ఉద్యమించారని చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లయినా ఇప్పటికీ దేశంలో అలాంటి పరిస్థితులే ఉన్నాయని అన్నారు. ప్రధాని మోడీని విమర్శిస్తే బీసీలను, దేశాన్ని విమర్శించినట్టుగా ప్రచారం చేస్తున్నారని చెప్పారు. అదానీ అక్రమాలను ప్రశ్నిస్తే దేశాన్ని ప్రశ్నించినట్టుగా బిజెపి నాయకులు అంటున్నారని అన్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలం, మనువాదం ప్రకారం మోడీ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఈ మనుస్మృతిని ఆనాడే అంబేద్కర్ తగులబెట్టారని గుర్తు చేశారు. సంఘ్‌పరివార్ శక్తులు తెలివిగా మనువాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని చెప్పారు. గాంధీని చంపిన గాడ్సేను దేశభక్తునిగా ప్రచారం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీరామనవమి రోజు గాడ్సే చిత్రపటాన్ని ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రదర్శించడం సిగ్గుచేటని విమర్శించారు. మనువాదం, ఆర్ఎస్ఎస్-బిజెపి సిద్ధాంతంపై లోతైన అధ్యయనం చేయాలని, సమాజ మార్పు కోసం బలమైన ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. చాడ మాట్లాడుతూ దేశంలో నిచ్చెనమెట్ల కులవ్యవస్థ ఉందన్నారు. ఆధునిక ప్రపంచంలోనూ గడ్డు పరిస్థితులను ప్రజలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మనిషిని మనిషిగా చూడని పరిస్థితులున్నాయని వివరించారు. అణగారిన వర్గాల పట్ల ఇప్పటికీ వివక్ష కొనసాగుతున్నదని అన్నారు. 150 ఏండ్ల కింద సామాజిక న్యాయం కోసం పూలే పనిచేశారని గుర్తు చేశారు. 1873లో సత్యశోధక్ సమాజాన్ని ఏర్పాటు చేశారని, బడుగు, బలహీనవర్గాలు, మహిళల అభ్యున్నతి కోసం పాటుపడ్డారని వివరించారు. భారత్‌లో ఇంకా సామాజిక న్యాయం రాలేదన్నారు. ఆజాదీ కా అమృత మహోత్సవాలు జరుగుతున్నా అణచివేత, వివక్ష పోలేదని చెప్పారు. ఈ నేపథ్యంలో సామాజిక న్యాయం సాధించడమే లక్ష్యంగా ఐక్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజంలో విషబీజాలను నాటాలని చూస్తున్న ఆర్ఎస్ఎస్, బీజేపీ విధానాలను, హిందూత్వ ఎజెండాను తిప్పికొట్టాలని కోరారు. పూలే ఆశయాల సాధన కోసం కృషి చేయాలన్నారు. ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ సామాజిక న్యాయానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ బాలమల్లేష్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవి రమణ అధ్యక్షత వహించగా, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్ నాయకులను వేదికపైకి ఆహ్వానించారు. తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్ వందన సమర్పణ చేశారు.

సామాజిక విప్లవకారుడు పూలే : నర్సింహారెడ్డి

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన పూలే సామాజిక విప్లవకారుడని ఎస్ఆర్‌శంకరన్ ఐఎఎస్ అకాడమీ చైర్మెన్ నంద్యాల నర్సింహారెడ్డి అన్నారు. అకాడమీలో ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల నర్సింహారెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను కాపాడుకోవడానికి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. స్వేచ్ఛ స్వాతంత్ర్యం, సార్వభౌమాధికారం, లౌకికతత్వం విలువలున్న గొప్ప రాజ్యాంగం మనదని తెలిపారు. జ్యోతిరావుపూలే స్మృతి సమితి నాయకులు సతీష్‌కుమార్ మాట్లాడుతూ మహిళలకు మొదటిగా విద్యను నేర్పించిన ఘనత పూలేకే దక్కుతుందని అన్నారు. ఆయన గొప్ప సంఘసంస్కర్త అని కొనియాడారు. అకాడమీ సలహాదారులు సత్యనారాయణ మాట్లాడుతూ ఏప్రిల్ మహనీయుల మాసమని, సమత, మమతల కోసం పాటుపడిన గొప్ప నాయకులు జన్మించిన సందర్భమని అన్నారు. పూలే వ్యక్తి కాదని, గొప్ప శక్తి అని వివరించారు. సమాజంలో సమూల మార్పుల కోసం పోరాడిన మహానాయకుడని చెప్పారు. అంతకుముందు రాజ్యాంగ పీఠికపై విద్యార్థులతో ప్రమాణం చేయించారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలేసి నివాళలర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌శంకరన్ అకాడమీ ఎఒ కె.సతీష్‌కుమార్, కో-ఆర్డినేటర్ జనార్దన్, విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరలో తొమ్మిది మెడికల్ కాలేజీలు ప్రారంభం

- 7,090కు చేరిన ఎంబిబిఎస్ సీట్లు
- మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో త్వరలో మరో తొమ్మిది మెడికల్ కాలేజీలను ప్రారంభించబోతున్నామని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. మంగళవారం ఆయన బోధనాస్పత్రుల నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 2014-15లో రాష్ట్రంలో ఎంబిబిఎస్ సీట్ల సంఖ్య 2,950 ఉంటే ప్రస్తుతం ఆ సంఖ్య 7,090కు చేరిందని తెలిపారు. ఎంబిబిఎస్ సీట్ల శాతం 240, పీజీ సీట్ల శాతం 111కు పెరిగాయని తెలిపారు. ఈ కాలంలో దేశంలో ఎంబిబిఎస్ సీట్ల శాతం 71, పీజీ సీట్ల శాతం 42 మాత్రమే పెరిగాయని చెప్పారు. రాష్ట్రంలో 65 మందికి ప్రొఫెసర్లుగా కొత్తగా పదోన్నతులు కల్పించామనీ, త్వరలో 210 మందికి అసోసియేట్ ప్రొఫెసర్లు, 1,442 మందికి అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు భర్తీ చేయనున్నట్టు తెలిపారు. 800 మంది సీనియర్ రెసిడెంట్ డాక్టర్లను జిల్లాల్లోని మెడికల్ కాలేజీలు, వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులకు కేటాయించినట్టు తెలిపారు. మెడికల్ కాలేజీల్లో ర్యాగింగ్ జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

సూపరింటెండెంట్లదే బాధ్యత

ఎంఎన్‌సీ నిబంధనల ప్రకారం మెడికల్ కాలేజీల నిర్వహణ, అన్ని వైద్య పరికరాలు పని చేసేలా చూడటం, డిశ్చార్జ్ అయిన రోగులకు ఉచితంగా మందుల సరఫరా, వాటి బోర్డుల ఏర్పాటు, మెనూ ప్రకారం డైట్ అందించడం, ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రత, ఇన్ఫెక్షన్ నియంత్రణ బాధ్యత ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్లదేనని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ కె.రమేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బలగం' మొగులయ్యకు తీవ్ర అస్వస్థత

వైద్య సాయం కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తన గాత్రంతో కళకు ప్రాణం పోసి బుర్రకథలతో ప్రజలను మెప్పించిన గాయకుడు మొగిలయ్య.. ఇటీవల విడుదలైన 'బలగం' సినిమాలో తన గాత్రంతో ప్రేక్షకులతో కంటతడి పెట్టించారు. అలా తెలుగువారందరికీ సుపరిచితమైన గాయకుడు మొగిలయ్య తీవ్ర అస్వస్థతకు గురయ్యి వరంగల్‌లోని సంరక్ష ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇప్పటికే రెండు కిడ్నీలు సరిగా పనిచేయకపోవడంతో వారానికి మూడుసార్లు డయాలసిస్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయనకు గుండె సంబంధిత సమస్య తలెత్తినట్టు వైద్యులు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించాలంటూ సూచించారు. తన భర్తకు వైద్య సాయం అందించి, తమ కుటుంబాన్ని ఆదుకోవాలని మొగిలయ్య భార్య కొమురమ్మ ప్రభుత్వాన్ని వేడుకుంటోంది. వరంగల్ జిల్లా దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన పస్తం మొగిలయ్య, కొమురమ్మ దంపతులు బుర్ర కథలు చెబుతూ జీవనం సాగిస్తున్నారు. తమ పూర్వీకుల నుంచి సంప్రదాయంగా వచ్చిన కళ బుర్రకథను చెప్పడమే వీళ్ల జీవనాధారం. మంచిర్యాల, గోదావరిఖని, కరీంనగర్, సిరిసిల్ల తదితర జిల్లాల్లో బుర్రకథ చెబుతూ వచ్చిన అరకొర ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఊరూరా బుర్ర కథలు చెబుతూ మొగిలయ్య కుటుంబం కొన్నేండ్ల కిందట దుగ్గొండికి వలస వచ్చింది. అప్పటి ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటిలోనే ఉంటున్నారు. ప్రస్తుతం ఆ ఇంటిపై కప్పు కూలిపోవడంతో పరదాలచాటున కాలం వెళ్లదీస్తున్నారు.

21న కెసిఆర్‌కు అభినందన సభ

- కొమ్ముల నరేందర్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర నూతన సచివాలయానికి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ పేరు పెట్టినందుకుగాను ఈ నెల 21న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బాబూ జగ్జీవన్‌రామ్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సిఎం కెసిఆర్‌కు కెసిఆర్‌కు కృతజ్ఞత, అభినందన సభను నిర్వహించనున్నట్టు సొసైటీ అధ్యక్షులు, బిఆర్ఎస్ నాయకులు కొమ్ముల నరేందర్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మంత్రి సత్యవతిరాథోడ్ మంగళవారం ఆవిష్కరించారు. అభినందన సభకు రావాలని మంత్రులను ఆయన ఈ సందర్భంగా ఆహ్వానించారు.

మనువాదంపై పోరాడటమే పూలేకు నిజమైన నివాళి

- ఆర్ శ్రీరాంనాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మనువాదంపై పోరాడటమే పూలేకు నిజమైన నివాళని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్ అన్నారు. మంగళవారం సామాజిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య పార్కు వద్ద పూలే 197వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మనువాదులు వేల సంవత్సరాలుగా ఎస్‌సి, ఎస్‌టి, బలహీన వర్గాలను శూద్రులుగా ముద్ర వేసి వారిని సమాన అవకాశాలకు దూరం చేశారని తెలిపారు. అణిచివేతకు గురిచేశారని చెప్పారు. మనుస్మృతి ఆధారంగానే ఈ విధానాన్ని అమలు చేశారని తెలిపారు. మనుస్మృతికి వ్యతిరేకంగా 150 ఏండ్ల క్రితమే పూలే అనేక ఉద్యమాలు నిర్వహించారని గుర్తు చేశారు. శూద్ర కులాలు, మహిళలకు విద్యను అందించడంతోపాటు వారికి సమాన అవకాశాలు ఉండాలంటూ ఆధిపత్య బ్రాహ్మణీయ వాదానికి వ్యతిరేకంగా పోరాడుతూనే ప్రత్యక్షంగా పాఠశాలలు నెలకొల్పి విద్యనందించారని తెలిపారు. ఇప్పుడు కేంద్రంలోని బిజెపి... రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని ప్రవేశపెట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించిందని తెలిపారు. కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జాన్ వెస్లీ , స్కైలాబ్ బాబు, దశరథ్, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎం.వి రమణ, నరేష్, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బాస్, మిరియం వెంకటేశ్వర్లు, రాజు, గిరిజన సంఘం హైదరాబాద్ సౌత్ జిల్లా నాయకులు ఆంగోత్ కృష్ణా నాయక్, చిన్నాశ్రీను,ఆర్.వెంకటేష్ లు పాల్గొన్నారు.

కాసాని జ్ఞానేశ్వర్‌ను కలిసి మాట్లాడుతున్న టిడిపి నాయకులు

టిడిపికి పూర్వ వైభవం ఎంతో దూరంలో లేదు

- అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగుజాతి ఉన్నంత వరకు టిడిపి వారి గుండెల్లో ఉంటుందని తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన నిస్తేజం తొలగిపోయి మరలా టిడిపికి పూర్వ వైభవం రావడం ఎంతో దూరం లేదన్నారు. మంగళవారం టిడిపి రాష్ట్ర కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్లో మిర్యాలగూడ, జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గాల నాయకులు కాసాని జ్ఞానేశ్వర్‌ను కలిశారు.

ఈ సందర్భంగా కాసాని వారినుద్దేశించి మాట్లాడుతూ ఎన్‌టిఆర్, చంద్రబాబు హయాంలోని టిడిపి ప్రభుత్వాలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను నేటికీ ప్రజలు మర్చిపోలేదన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్నపుడు సంక్షేమ పాలన అంటే ఇది అని చేసి చూపించిన ఘనత టిడిపిదేనని చెప్పారు. నేటి ప్రభుత్వాలు ప్రజలపై అప్పుల భారం మోపుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ ప్రభుత్వాల పనితీరును చూసిన ప్రజలు తమకు మళ్లీ టిడిపి పాలనలో మంచి రోజులు రావాలని కోరుకుంటున్నారని అభిప్రాయపడ్డారు. టిడిపికి ప్రజల నుంచి వస్తున్న అనూహ్య స్పందనే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రజలు తెలుగుదేశం పార్టీని ఆశీర్వదిస్తున్నపుడు పార్టీ నాయకులు విభేదాలను వీడి కలిసిపోవాలని జ్ఞానేశ్వర్ సూచించారు. భిన్నాభిప్రాయాలు ఎక్కడైనా సహజమేనని, కానీ పార్టీ నాయకుల్లో, శ్రేణుల్లో ఐక్యత తప్పనిసరిగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జాతీయ అధికార ప్రతినిధి టి జ్యోత్స్న, రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ బియ్యని సురేష్, రాష్ట్ర నాయకులు ఆరీఫ్, మిర్యాలగూడ నియోజకవర్గ నాయకులు కాసుల సత్యం, జడ రాములు యాదవ్, ధీరవత్ మాన్యా నాయక్, ముక్కెర అంజిబాబు, ఎండి జహంగీర్ పాల్గొన్నారు.

యురేనియం తవ్వకాన్ని అడ్డుకున్నది రాష్ట్ర సర్కారే

- అనుమతిస్తే నల్లగొండ అభివృద్ధి చెందేది : లక్ష్మణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'నల్లగొండ జిల్లాలో యురేనియం నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. కెసిఆర్ ఏమో తొవ్వనిచ్చే ప్రసక్తే లేదంటున్నడు. పులివెందులలో యూసీఐఎల్ ద్వారా యురేనియం తవ్వకాలు జరుగుతున్నాయి. నిక్షేపాలను వెలికి తీస్తున్నారు. ఇక్కడేమో కెసిఆర్ సర్కారు అడ్డుకుంటోంది. ఒక కిలో యురేనియం విలువ 35 కేజీల బొగ్గుతో సమానం. ఫ్రాన్స్‌లో 70 శాతం ఎనర్జీ యురేనియం ద్వారానే ఉత్పత్తి అవుతోంది. ఈ విషయంలో నల్లగొండ జిల్లా ప్రజలకు విశ్వాసం కల్పించాల్సిన రాష్ట్ర సర్కారు తన బాధ్యతను విస్మరించింది. తవ్వకాలు ప్రారంభమై ఉంటే కొన్నివేల మందికి ఉద్యోగాలు, పరోక్షంగా ఉపాధి లభించే అవకాశం ఉండేది. నల్లగొండ జిల్లా వేగంగా అభివృద్ధి చెందేది. ఇలాంటి వాటికి దిక్కులేదుగానీ విశాఖ స్టీలు ఫ్యాక్టరీ గురించి మాట్లాడుతుంటే తెలంగాణ ప్రజలు నవ్వుకుంటున్నారు' అని బిజెపి ఎంపి, ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె లక్ష్మణ్ అన్నారు. తాను గొప్ప విజ్ఞాని అనీ, బిజెపి వాళ్లు అజ్ఞానులు అన్నట్టు కేటీఆర్ మాట్లాడారని విమర్శించారు. అమెరికాలో చదివినంత మాత్రాన మిగతా వాళ్లను చులకన చూసి మాట్లాడటం సరికాదని, దాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కెటిఆర్ నిద్రలోనూ అదాని, ప్రధాని అని కలవరిస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో మూతపడ్డ పరిశ్రమలకే దిక్కు లేదుగానీ వైజాగ్ స్టీల్ ప్లాంట్ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా భూ కేటాయింపు

- యశోదకు రూ. వంద కోట్లకే రూ. 800 కోట్ల భూమి
- అందులో కెటిఆర్ కమీషన్ 20 శాతం
- ఆరోపణలు తప్పని నిరూపించాలని కెటిఆర్‌కు రేవంత్ సవాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిబంధనలకు విరుద్ధంగా ముఖ్యమంత్రి కెసిఆర్ భూకేటాయింపులు చేస్తున్నారని పిసిసి అధ్యక్షులు, ఎంపి ఎనుముల రేవంత్‌రెడ్డి విమర్శించారు. కోట్ల రూపాయలను దోపిడీ చేస్తున్న వైనంలో భాగంగా నిన్న హెటిరో పార్థసారథి రెడ్డి వ్యవహారాన్ని వెలుగులోకి తెచ్చిన రేవంత్... యశోద సంస్థకు భూముల కట్టబెట్టడం వెనుక కుట్ర జరిగిందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు అంజన్ కుమార్ యాదవ్, మల్లు రవి, జగదీశ్వర్ రావు, చామల కిరణ్‌కుమార్ రెడ్డితో కలిసి రేవంత్ విలేకర్లతో మాట్లాడారు. హైటెక్ సిటీ సమీపంలో రూ.800 కోట్ల విలువైన భూమిని కేవలం రూ. వంద కోట్లకే యశోద ఆస్పత్రి యాజమాన్యాకి కేటాయించినట్లు ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో 2010లో వైద్య ఆరోగ్య రంగంలో పరిశోధనలు, మౌలిక సదుపాయాల కల్పన కోసం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అమెరికాకు చెందిన అలగ్జాండ్రియా అనే కంపెనీకి శేరిలింగంపల్లి మండలం, ఖానాపూర్ గ్రామం సర్వే నెంబర్ 41/14లో ఐదు ఎకరాల స్థలాన్ని, ఎకరా రూ. పది కోట్ల చొప్పున ధర నిర్ణయించి కేటాయిస్తూ సేల్ డీడ్ చేసుకుందని గుర్తు చేశారు. జిఒ నెంబర్ 1484, లోకాయుక్త అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని అక్కడ ఎకర ధర రూ. 10 కోట్లు కాదు...రూ.12 కోట్లు ఉందని నిర్ధారణ కావడంతో ఈ మేరకు ఆ సర్వే నెంబర్‌లో స్థలం పొందిన అలగ్జాండ్రియాతో పాటు మారుతి సుజుకీ కంపెనీలకు 5.6.2012న హెచ్ఎండీఏ లేఖ రాసిందన్నారు. సదరు సర్వే నెంబర్‌లో ఎకర రూ.12 కోట్లు ధర పలుకుతున్నందున ముందుగా చెల్లించిన మొత్తానికి అదనంగా... ఎకరానికి రూ.రెండు కోట్లు చెల్లించాలని ఆ లేఖలో పేర్కొందని గుర్తు చేశారు. ఈ లేఖపై స్పందించిన మారుతి సుజుకీ తనకు కేటాయించి రెండు ఎకరాల స్థలానికి అదనంగా చెల్లించాల్సిన రూ. నాలుగు కోట్లు చెల్లించిందని తెలిపారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి

అలగ్జాండ్రియా మాత్రం ఈ అంశంపై కోర్టుకు వెళ్లిందని చెప్పారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఖానామెట్ గ్రామంలో సర్వే నెంబర్ 41/14లో ఉన్న భూమిపై కల్వకుంట్ల మాఫియా కన్నుపడిందని ఆరోపించారు. అప్పటికే అలగ్జాండ్రియాకు కేటాయించిన భూమి ధర వివాదం కోర్టులో ఉండటంతో దానిని సాకుగా చూపి అలగ్జాండ్రియాను బెదిరించి 2016లో అలగ్జాండ్రియా కంపెనీలోకి కల్వకుంట్ల జగన్నాథరావు, గోరుకంటి రవీందర్‌రావు, గోరుకంటి దేవేందర్ రావు డైరెక్టర్లుగా చొరబడ్డారని వివరించారు. జగన్నాథరావుకు కల్వకుంట్ల అనే ఇంటి పేరు తప్ప ఎటువంటి అర్హత లేదని ఎద్దేవా చేశారు. ఆ విధంగా అలగ్జాండ్రియా అనే కంపెనీ కల్వకుంట్ల మాఫియా సొంతమైందని చెప్పారు. ఆ తర్వాత కోర్టులో ఉద్దేశపూర్వకంగానే కేసు ఓడిపోయి తన మాఫియా సభ్యులుగా ఉన్న డైరెక్టర్లకు రూ.500 కోట్ల విలువైన భూమిని దారాదత్తం చేసిందన్నారు. ఈ కారణంగా ప్రభుత్వ ఖజానాకు అదనంగా రావాల్సిన రూ.పది కోట్లు రాలేదనీ, రూ.500 కోట్ల అత్యంత విలువైన ప్రభుత్వ భూమి వారికి దక్కిందన్నారు. అర్హత లేకపోయినా వారికి కట్టబెట్టిన భూమిని వెనక్కి తీసుకునే హక్కు ప్రభుత్వానికి ఉంటుందన్నారు. వాస్తవానికి హైటెక్ సిటీ సమీపంలో ఉన్న ఈ భూమి ధర 2017లో గజానికి రూ. రెండు లక్షలకు తక్కువ లేదన్నారు. యశోద గ్రూప్ గజం రూ.37,611కు కొనుగోలు చేసిందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ఎకరాకు రూ.33.70 కోట్లు ఉందని తెలిపారు. ఈ భూదోపిడీలో అలగ్జాండ్రియాలో రూ.500 కోట్లు, యశోద గ్రూప్‌కు రూ.300 కోట్ల విలువైన భూములను కేవలం రూ. వంద కోట్లకే కట్టబెట్టిందన్నారు. నిరుద్యోగ కుటుంబానికో లక్ష రూపాయలు సాయం చేయాలని కెసిఆర్ ఎందుకు ఆలోచించలేదన్నారు. ఆ భూములను అమ్మితే రూ.2500 కోట్లు వస్తాయని, ఆ సొమ్ముతో నిరుద్యోగులను ఆదుకోవచ్చు అని తెలిపారు. అత్యంత కీలకమైన లిక్కర్ కుంభకోణంలో ఉన్న వ్యక్తులకు కేటాయించిన భూముల వివరాలను, వారి బంధాన్ని బుధవారం బయటపెడతానని వెల్లడించారు. తాను ప్రభుత్వంపై చేసిన ఆరోపణలు తప్పని నిరూపించాలని కెటిఆర్‌కు సవాల్ విసిరారు.

కోత లేకుండా గుండె శస్త్ర చికిత్స

నిమ్స్ వైద్యుల ఘనత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిమ్స్ ఆస్పత్రిలో కోత లేకుండా అరుదైన గుండె శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. కాథెటర్ ద్వారా మైట్రల్ వాల్వ్ మార్పిడి చికిత్సను ఆ ఆస్పత్రిలో తొలిసారిగా చేశారు. జగిత్యాలకు చెందిన దేవమ్మ (67) 2015లో ఆపరేషన్ ద్వారా మైట్రల్ వాల్వ్ మార్పిడి చేయించుకుంది . ప్రస్తుతం ఆ వాల్వ్ మూసుకుపోవడంతో అవస్థ పడుతూ పలు ఆస్పత్రులు తిరిగింది. చివరకు నిమ్స్ కార్డియాలజీ విభాగంలో చేరింది. మరోసారి గుండె కోత ఆపరేషన్ చేయడమనేది రిస్క్‌తో కూడుకుంది. కాబట్టి కోత లేకుండా, తొడ నుంచి కాథెటర్ ద్వారా వాల్వ్ మార్పిడి చేశారు. ఈ శస్త్రచికిత్సను నిమ్స్ కార్డియాలజీ విభాగాధిపతి డా బి శ్రీనివాస్ ఆధ్వర్యంలో డాక్టర్లు సతీష్ రావు, మణి కృష్ణ, హరీష్ రెడ్డి, ప్రదీప్, సదానంద్, మెహరున్నీసాతో కూడిన బృందం విజయవంతంగా పూర్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వం సిఎంఆర్ఎఫ్ ద్వారా చేసిన ఆర్థిక సహాయంతో ఇది సాధ్యమైందని అధికారులు వెల్లడించారు.

వేతనాలు చెల్లించండి

- హరీశ్‌రావుకు కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం వినతి
- మంజూరు చేయాలంటూ అధికారులకు ఆర్థిక మంత్రి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు జనవరి, ఫిబ్రవరి పెండింగ్ వేతనాలను చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం (టిఎస్‌జిసిసిఎల్ఎ-475) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు ఆన్‌లైన్ ద్వారా మంగళవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి రమణారెడ్డి, డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ వినతిపత్రం పంపించారు. జనవరి, ఫిబ్రవరికి సంబంధించి జిల్లా కోశాధికారి నుంచి టోకెన్ నెంబర్లు వచ్చినప్పటికీ ప్రభుత్వం వద్ద తమ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీనివల్ల కాంట్రాక్టు అధ్యాపకులకు వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అలాగే బ్యాంకుల వద్ద తీసుకున్న రుణాలకు నెలవారి చెల్లింపులు సక్రమంగా ఇవ్వకపోతే అధిక వడ్డీలు పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు జోక్యం చేసుకున్నారని తెలిపారు. టోకెన్ నెంబర్లు వచ్చిన వారికి వెంటనే వేతనాలను మంజూరు చేయాలంటూ అధికారులను ఆదేశించారని పేర్కొన్నారు. మార్చి వేతనాలు కూడా విడుదల చేయాలని మంత్రిని ఈ సందర్భంగా నేతలు కోరారు.

మౌన ఆవేదన కార్యక్రమం విజయవంతం

కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ కోసం ఇంటర్ మూల్యాంకన కేంద్రాల వద్ద కాంట్రాక్టు అధ్యాపకుల మౌన ఆవేదన కార్యక్రమం ఐదో రోజు మంగళవారం విజయవంతమైందని టిఎస్‌జిసిసిఎల్ఎ-475 రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి రమణారెడ్డి, కొప్పిశెట్టి సురేష్ తెలిపారు. ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు చిత్రపటంతో రాష్ట్ర వ్యాప్తంగా మూల్యాంకన కేంద్రాల వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని పేర్కొన్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి రాష్ట్రంలోని కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకులను క్రమబద్ధీకరిస్తామంటూ ఆర్థిక మంత్రి టి హరీశ్‌రావు బడ్జెట్ ప్రసంగంలో పొందుపర్చారని గుర్తు చేశారు. దాంతో 22 ఏండ్ల వెట్టిచాకిరికి విముక్తి కలుగుతుందంటూ తాము సంతోషించామని వివరించారు. అయితే ఇప్పటికీ క్రమబద్ధీకరణ ఉత్తర్వులు రాకపోవడంతో తీవ్ర మానసిక ఆవేదనలో ఉన్నామని తెలిపారు. సీఎం కేసీఆర్ జోక్యం చేసుకుని క్రమబద్ధీకణ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

16న ఎంఎన్‌జె కేన్సర్ ఆస్పత్రి కొత్త బ్లాక్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేన్సర్ రోగుల కోసం ఎంఎన్‌జె ఆస్పత్రి నిర్మించిన కొత్త బ్లాక్‌ను ఈ నెల 16న వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రారంభించనున్నారు. హైదరాబాద్ రెడ్‌హిల్స్ సమీపంలో 300 పడకలతో నిర్మితమైన ఈ భవనాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు రోగులకు అందుబాటులోకి తేనున్నారు. పీడియాట్రిక్ ఆంకాలజీ, బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంట్, ఉమెన్ క్యాన్సర్ వింగ్, ఫిమేల్ లుకేమియా వార్డ్, అడల్ట్ మెడికల్ ఆంకాలజీ వంటి ప్రధాన విభాగాలను కొత్త బ్లాక్‌లో ఏర్పాటు చేశారు. వీటితోపాటు రెగ్యులర్ ఓపీని నిర్వహించనున్నారు. ఇప్పటికే 30 మంది డాక్టర్లను, 50 మంది స్టాఫ్ నర్సులను, పారామెడికల్ సిబ్బందిని నియమించారు. ఆస్పత్రిలో పారిశుధ్యం, భద్రతలను ప్రవాస భారతీయుడు డాక్టర్ శరత్‌కు చెందిన స్మార్ట్ స్వచ్ఛంద సంస్థ మూడేండ్లపాటు ఉచితంగా నిర్వహించేందుకు ముందుకొచ్చింది. ఆక్సిజన్ పైప్‌లైన్, 60 ఐసియు పడకలతో అత్యాధునిక చికిత్సలను అందించేలా ఆస్పత్రిని తీర్చిదిద్దారు. ఇన్‌పేషెంట్ రోగులకే కాకుండా డే కేర్ యూనిట్‌లో 50 బెడ్లతో అవుట్ పేషెంట్ రోగులకు ఒకే రోజు చికిత్సనందించి పంపించనున్నారు.

అత్యంత పటిష్టమైన టైర్‌గా ఎంఆర్ఎఫ్

హైదరాబాద్ : అత్యంత విలువైన, పటిష్టమైన టైర్ బ్రాండ్లపై బ్రాండ్ ఫైనాన్స్ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం ప్రపంచంలోనే అత్యంత పటిష్టమైన టైర్ బ్రాండ్‌గా ఎంఆర్ఎఫ్ లిమిటెడ్ నిలిచింది. దాదాపు అన్ని పరిమితుల్లోనూ అత్యధిక స్కోర్‌ను పొందినట్లు ఆ సంస్థ తెలిపింది. అలాగే ప్రపంచంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న రెండవ టైర్ల బ్రాండ్‌గానూ నిలిచిందని వెల్లడించింది. బ్రాండ్ పటిష్టతలో 100కి 83.2 స్కోరును ఎంఆర్ఎఫ్ లిమిటెడ్ సాధించిందని.. ఎఎఎఫ్-బ్రాండ్ రేటింగ్‌ను అందుకుందని పేర్కొంది.

చెఫ్ సీజన్ 2 పోటీలు ప్రారంభం

హైదరాబాద్ : గతేడాది అపూర్వ విజయం సాధించిన గేటెడ్ కమ్యూనిటీ లైవ్ కుకింగ్ పోటీలు మరో మారు నగరంలో జరుగుతున్నాయని ఎస్ఐపిఎల్ ఈవెంట్స్ ఫౌండర్ ప్రవీణ్ కె అగర్వాల్ తెలిపారు. సీజన్1కు అపూర్వ స్పందన లభించిందని, ఆ స్ఫూర్తితోనే సీజన్ 2 ప్రారంభించామని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయి పోటీలుగా వీటిని నిర్వహించే ఆలోచనలో ఉన్నామన్నారు. నగరంలో దాదాపు 30కుపైగా హై రైజ్ గేటెడ్ కమ్యూనిటీలలో ఈ పోటీలు జరగనున్నాయన్నారు.